క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ నాదర్‌గుల్ టీఎస్ఐఐసీ ఫీడర్, గ్రీన్ ఫీల్డ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతిపురం, గైరాన్‌కోట, ఎంఎస్ఆర్ హోమ్స్, ద్వారకాపురి, మర్రిగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌పీఆర్ హోమ్స్, ఇంద్రానగర్, జన్నారం, ఆదిబట్ల మెయిన్‌రోడ్ తదితర ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

మంచాల: ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శోభ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల కేంద్రంలో లయన్స్ క్లబ్, సాధురం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఎస్ఐ లాలయ్య, ఏఎస్ఐ సతీష్, డాక్టర్లు ఎమ్మెస్ రెడ్డి, భగవాన్, యాదగిరి, ఎస్.కె. భిక్షపతి, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు అశ్వల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి ఫ్యాన్ల అందజేత



ఫ్యాన్లు బహూకరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పది సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాల ఆవరణలో శనివారం లయన్ సభ్యులు కండె ఓంకారం, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్యలు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శేఖర్, శ్రీను, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో మహా పడిపూజ



పడిపూజలో భక్తజనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలో స్వయంభువుగా వెలసిన శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వద్ద అయ్యప్ప మాలధారులు శనివారం మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మాజీ పట్వారి జైశ్రీరాం రెడ్డి.. అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం సమర్పించారు.

సీపీఎం నేతల పరామర్శ

ఆమనగల్లు: తలకొండపల్లి మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ తండ్రి జంగయ్యయాదవ్ ఇటీవల మృతిచెందాడు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, తలకొండపల్లి మండల పరిధి వెల్జాల గ్రామంలో శనివారం జంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌ను పరామర్శించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కానుగుల వెంకటయ్య, ఏరియా కమిటీ కన్వీనర్ శివశంకర్, నాయకులు పెంటయ్య, పోచయ్య తదితరులు ఉన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: బీఆర్ఎస్ పట్టణ నాయకుడు ఎంగలి రఘు తల్లి సుశీలమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా శనివారం సంస్మరణ సభ నిర్వహించగా.. ఆమె చిత్రపటానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం సుశీలమ్మ కుమారులు బాలకిష్టయ్య, యాదగిరి, శ్రీనివాస్, రఘు, రమేశ్‌లను పరామర్శించారు. బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడి ఉన్నారు.

మసకబారిన గ్రంథాలయం

గ్రంథాలయం దేవాలయంతో సమానం. అలాంటి వ్యవస్థ నేడు పూర్తిగా మసకబారిపోయింది. వాటి అభివృద్ధి గురించి ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా సొంత భవనాల సంగతి ఎలా ఉన్నా.. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. సౌకర్యాలు కరువై.. అరకొర పుస్తకాలు, దినపత్రికలతో కాలం వెల్లదీస్తున్నాయి.

శిథిల గది.. వసతులు కరువు

- ఊసేలేని కొత్త పుస్తకాల కొనుగోలు
- జనాభా పెరిగినా.. ఊరు విస్తరించినా అభివృద్ధి శూన్యం
- ఇరుకు గదిలో కొనసాగుతున్న విజ్ఞాన భాండాగారం



వెలవెలబోతున్న గ్రామీణ గ్రంథాలయం

కడ్తాల్: మండల కేంద్రంలో 26 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన మినీ గ్రంథాలయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. నేటికీ అలాగే కొనసాగుతోంది. హైదరాబాద్‌కు సమీపాన ఉండటంతో పాటు.. పట్టణం విస్తరించి, మండలంగా ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. అయినా లైబ్రరి స్థాయిని పెంచడం, సొంత భవనం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమయింది. కనీసం పుస్తకాలు, దినపత్రికలు సరిగా లేకపోవడంతో పాఠకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రకటనలకే పరిమితం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సొంత గ్రంథాలయం భవనం నిర్మిస్తామని నాటి ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ కలగానే మిగిలింది. ఊరు, జనాభా పెరిగింది. కానీ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు సంబంధిత అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అరకొర సౌకర్యాల నడుమ పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు పోటీ పరీక్షల పుస్తకాలను కొనుగోలు చేసి, చదివే అవకాశం ఉంటుందని, అదే నిరుపేదలకు ఆ అవకాశం ఉండదని, అలాంటి వారి కోసం ఎంతగానో ఉపయోగం పడే గ్రంథాలయాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తీర్మానం చేసినా..

గ్రంథాలయ భవన నిర్మాణం కోసం గతంలో గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులతో పాటు, మండల ప్రజా ప్రతినిధులు, మండల కేంద్రంలో పలు స్థలాలను పరిశీలించారు. స్థలాన్ని ఎంపిక చేసి, గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. అనంతరం సంబంధిత జిల్లా అధికారులకు తీర్మాన పత్రం ప్రతులు అందజేసినట్లు పలువురు నాయకులు, నాటి ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. అయినా భవన నిర్మాణానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. భవన నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చి, తగిన నిధులు మంజూరు చేస్తే సమస్య తీరుతుందని వెల్లడిస్తున్నారు.

పది మందికి విజ్ఞానం

ఒక వ్యక్తి ఉన్నతంగా ఎదగడానికి పుస్తక పఠనం, జ్ఞానం, వివేకం ఎంతో అవసరం. వాటన్నింటికి మూలం పుస్తకాలు చదవడమే. అందుకు రకరకాల గ్రంథాలు కావాల్సి ఉంటుంది. ముఖ్యంగా చరిత్ర, సాహిత్యం బుక్స్. అలా పది మందికి విజ్ఞానం పెంపొందించే కేంద్రాలు గ్రంథాలయాలు. వాటి అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పాఠకులు కోరుతున్నారు.

అభ్యర్థులకు ఉపయోగం



గ్రంథాలయం పుస్తక పఠన ప్రియులతో పాటు.. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు చాలా అవసరం. ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. లైబ్రరీని అభివృద్ధి చేయడంతో పాటు.. స్టడీ మెటీరియల్, తెలుగు, ఆంగ్లం దినపత్రికలు, వార, మాస పత్రికలు, చరిత్ర, పురాణ కథలు, జ్ఞానం పెంపొందించే పుస్తకాలు సమకూర్చాలి. సౌకర్యాలు కల్పించాలి.

– భానుకిరణ్, నిరుద్యోగి, కడ్తాల్

భవనం నిర్మించేందుకు కృషి



మండల కేంద్రంలో మినీ గ్రంథాలయాన్ని ఆధునీకరించేందుకు కృషి చేస్తాం. ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులకు సమస్యను వివరిస్తాం. భవన నిర్మాణానికి చొరవతీసుకుంటాం. అవసరమైన నిధులు మంజూరి చేయించి, అన్ని రకాల పుస్తకాలు, దినపత్రికలను కొనుగోలు చేయిస్తాం. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం. పాఠకుల ఇబ్బందులను తొలగిస్తాం.

– జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు, కడ్తాల్

విగ్రహాల ఏర్పాటుకు స్థలం ఇవ్వండి

ఎమ్మెల్యే కసిరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి

ఆమనగల్లు: పట్టణంలోని రాజీవ్ కూడలిలో దివంగత నేతలు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. పరిశీలన అనంతరం నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.



అర్జున్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

విద్యార్థికి అభినందన

పంజాబ్‌లో ఇటీవల నిర్వహించిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో కరాటే విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి, రజత పతకం సాధించిన వెల్దండ మండలం నగారాతండాకు చెందిన విద్యార్థి అర్జున్ మురళిని ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



హెచ్ఎం రాములును పరామర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టీఎస్‌యూటీఎఫ్ నాయకుల డిమాండ్

కడ్తాల్: తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములుపై అయ్యప్ప భక్తుల ముసుగులో కొందరు భౌతికంగా దాడి చేశారని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఆరోపించారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శనివారం హెచ్ఎంను నాయకులు పరామర్శించి మాట్లాడారు. ఈ నెల 21న పాఠశాల సమయం అనంతరం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో అయ్యప్ప మాలధరించిన విద్యార్థికి హెచ్ఎం చేయి తగిలిందని తెలిపారు. దీంతో హెచ్ఎం కావాలనే విద్యార్థిని కాలుతో తన్నాడని ఆరోపిస్తూ.. కొందరు అయ్యప్ప మాలధారులు ఆయనపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. రెండు రోజుల అనంతరం పెద్ద సంఖ్యలో వచ్చి, హెచ్ఎంను దూషించడంతో పాటు మరోసారి దాడి చేసినట్లు వెల్లడించారు. అంతటితో ఆగకుండా హెచ్ఎంతో విద్యార్థి కాళ్లు మొక్కించారని తెలిపారు. వెల్లడించారు. దాడిని ఖండిస్తున్నామని, నిందితులను వెంటనే శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, మండల అధ్యక్షుడు జంగయ్య తదితరులు ఉన్నారు.

ధ్యాన జగత్తుకు కృషిచేయాలి

కడ్తాల్: ధ్యాన గురువు బ్రహ్మర్షి పత్రీజీ వేసిన ధ్యానమనే పునాదులపై సకలజనులు నడుచుకోవాలని పరిణీత పత్రి సూచించారు. మహేశ్వర మహాపిరమిడ్ పత్రీజీ ధ్యాన మహాయాగం శనివారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రాపంచిక ఎదుగుదలతో పాటు, ఆధ్యాత్మిక ఎదుగుదల ఉండాలని చెప్పారు. ధ్యాన జగత్తుకు కృషి చేయాలని కోరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి.. మహాయాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



కళాకారిణుల నృత్య ప్రదర్శన

ఆడపిల్లకు చదువే ఆయుధం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్

సీఐ సుధాకర్

బడంగ్‌పేట్: ఆడపిల్లలకు చదువే ఆయుధమని, బాలికలు తమ విద్యను పూర్తి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ అన్నారు. శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చైల్డ్ రైట్స్ అండ్ యూ, బాలల హక్కుల జిల్లా కో-ఆర్డినేటర్ కొమ్ము తిరుపతి ఆధ్వర్యంలో బాలికలు చదువుకోవాలి అనే కాన్సెప్ట్‌తో కూడిన వాల్‌పోస్టర్‌ను ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకొని, ఉన్నత రంగాల్లో రాణించాలని సూచించారు. బాల్యావివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అమ్మాయిల చదువు దేశానికి వెలుగని, వారిని చదువులో తల్లిదండ్రులు ప్రోత్సహించాని సూచించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా నాయకులు సల్వాది రమేశ్, జర్పుల కృష్ణ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

కడ్తాల్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, కారోబార్లకు, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం రూ.10 లక్షలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, మహేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఆలూరి ఆంజనేయులుకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.16 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శనివారం ఇప్పలపల్లిలో బాధితుడికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చెక్కు అందజేశారు. నాయకులు ప్రశాంత్‌రెడ్డి, డేవిడ్, రేణురెడ్డి, శంకర్, శివగౌడ్, చంద్రమౌళి, కిషన్, వాల్మీకి, శ్రీను, అంజయ్య ఉన్నారు.

వెల్జాల్‌లో..

మండల పరిధి వెల్జాల్ గ్రామానికి చెందిన తిరుపతయ్య చికిత్సపొందుతూ మృతిచెందగా.. సీఎంఆర్ఎఫ్ కింద రూ.60 వేలు మంజూరు అయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు చెక్కు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంబాజీ ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తాం

ఇబ్రహీంపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేస్తామని చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా పట్నం కార్యాలయంలో శనివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అనుభవంతో మార్కెట్ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానని, రైతులకు అండగా ఉంటానని తెలిపారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు మృతికి సంతాపం తెలిపాసే. అనంతరం మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సమావేశంలో పాలకవర్గ సభ్యులు

సమావేశంలో వైస్ చైర్మన్ కరుణాకర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆరోపించారు. సమ్మెలో భాగంగా కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీఓ గీతకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, ప్రతి నెలా రూ.18 వేల వేతనంతో పాటు రూ.10లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కారోబార్లు నర్సింహ, హరికృష్ణ, కార్మికులు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



నాలా పనులను కమిషనర్‌కు వివరిస్తున్న కౌన్సిలర్ అహ్మద్ కసాది

పహాడీషరీఫ్: నబీల్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జల్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ అహ్మద్ కసాది అన్నారు. పెండింగ్ పనుల కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల విషయాన్ని ఆయన కమిషనర్ బి.వెంకట్రామ్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నబీల్ కాలనీలో నెలకొన్న ముంపు సమస్యపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో నాలా నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కానీ ప్రస్తుతం కొనసాగుతున్న నాలా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఆరోపించారు. అసంపూర్తి పనుల కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. నబీల్ కాలనీ నుంచి గుర్రం చెరువు వరకు ఈ పనులు పూర్తి చేస్తేనే బస్తీకి ముంపు సమస్య తీరుతుందన్నారు. కాలనీకి ఎగువన రూ.6.5 కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే సబితారెడ్డికి ఫోన్‌లో వివరించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తానని ఆమె హామీనిచ్చారని కౌన్సిలర్ తెలిపారు. కాలనీలో దోమల నివారణ కోసం ఎప్పటికప్పుడూ ఫాగింగ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణాధికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మరింత పారదర్శకంగా 'ఉపాధి'

- కూలీలకు వరం జన్‌మన్‌రేగా యాప్
- సమగ్రంగా పథకం వివరాలు నిక్షిప్తం
- 'కూలీ'ల సమాచారం తెలుసుకునేందుకు దోహదం
- అక్రమాలపై ఫిర్యాదుకు అవకాశం

ఉపాధి పనుల్లో పూర్తి పారదర్శకత కోసం కేంద్రం ప్రభుత్వం తెచ్చిన 'జన్‌మన్‌రేగా' యాప్ ద్వారా సమాచారం అందుబాటులోకి వచ్చింది. కూలీలతో పాటు ఎవరైనా దీనిద్వారా క్షణాల్లో వివరాలు తెలుసుకోవచ్చు. అరచేతిలో ఫోన్ ఉంటే చాలు.. ఎన్నిరోజులు పనిచేశాం, ఏ బ్యాంకులో ఎంత కూలి జమయిందో తెలుసుకోవడంతో పాటు.. ఉపాధిలో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.





గంగారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మహేశ్వరం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు డబ్బులు చెల్లింపులో అనేక మార్పులు జరుగుతున్నాయి. పారదర్శతకు బ్యాంకు, తపాల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. కొందరి ఖాతాల వివరాలు అనుసంధానం కాకపోవడం, తప్పుగా నమోదు కావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్‌రేగా' యాప్‌ను ఆవిష్కరించింది. ఇందులో కూలీల, పనుల పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంది.

ఆక్టివ్‌గా 3,653 మంది

మండల పరిధి 30 గ్రామ పంచాయతీలలో ఉపాధి పథకం పనులు జరుగుతున్నాయి. అందులో 6,568 కుటుంబాలు(9,231) వ్యక్తులు ఉన్నారు. ఆక్టివ్‌గా 3,653 మంది పనిచేస్తున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, భూమి అభివృద్ధి పనులు, చెరువులు, కుంటల పూడిక తీత, రైతుల పశువుల షెడ్ల నిర్మాణం, వరద మళ్లింపునకు కాలువలు, ఇంకుడు గుంతల తవ్వకం లాంటి పనులు చేపడుతున్నారు.

యాప్‌లో పూర్తి వివరాలు

ఉపాధి పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్‌రేగా' యాప్‌ను రూపొందించింది. ఫోన్‌లో ఈ యాప్‌పు డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. ఇందులో కూలీల హాజరు, డబ్బుల జమ విభాగం క్లిక్ చేస్తే సంబంధిత సమాచారం వెలుగు చూస్తుంది. రాష్ట్రం, జిల్లా జాబ్‌కార్డు, కుటుంబ గుర్తింపు సంఖ్య నమోదు చేస్తే వివరాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలీ డబ్బులు బ్యాంకులో జమ వివరాలు కనిపిస్తాయి. కూలీ డబ్బులు జమకాకపోతే దానికి గల కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. మరోవైపు పథకంలో చేపట్టే పనుల సమాచారం తెలుసుకోవడంతో పాటే.. ఉపాధి అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్‌ను అన్ని భారతీయ గుర్తింపు పొందిన భాషల్లో చూసుకోవచ్చు.

కూలీలకు అవగాహన

కూలీ డబ్బుల కోసం చాలా మంది కూలీలు ఏపీఎం కార్యాలయం చుట్టూ తిరుగుతుంటారు. జన్‌మన్‌రేగా యాప్ గురించి వారికి అవగాహన కల్పిస్తే ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

వివరాలు తెలుస్తున్నాయి



జన్‌మన్‌రేగా యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాను. దీని ద్వారా కూలీల హాజరు, బ్యాంకు వివరాలు, ఖాతాల్లో కూలీ డబ్బుల జమ గురించి తెలుస్తున్నాయి. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. అందరికీ అవగాహన కల్పిస్తే మంచిది.

– ప్రవీణ్, ఉపాధి కూలీ, ఘట్టుపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



ఉపాధి పథకంలో భాగంగా కేంద్రం తెచ్చిన జన్‌మన్‌రేగా యాప్ కూలీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఉపాధి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. గ్రామ సభల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇందులో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం